క్లుప్తంగా

గ్రంథాలయంలో పుస్తక పఠనం



విద్యార్థులకు పద్య కవితలు వినిపిస్తున్న వెంకటేశ్వరరావు

అల్లిపురం: శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి పిల్లలు కథల పుస్తకాలు చదువుకున్నారు. విద్యోదయ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు వి.వెంకటేశ్వరరావు విద్యార్థులకు పుస్తకాల్లో కథలు చదివి వాటిలో నీతిని వివరించారు. తెలుగు పద్య కవితలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.రెడ్డి, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

11న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 11న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

వాటర్ క్యాన్లు పంపిణీ



వాటర్ క్యాన్లు పంపిణీ చేస్తున్న మహ్మద్ సాధిక్

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డు ప్రజలకు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిరంతరం శ్రమిస్తుంటే ఆయన స్ఫూర్తిగా వార్డులో ప్రజాభివృద్ధికి తాను శ్రమిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పండావీధిలో ఆక్రమణలు తొలగిస్తున్న జీవీఎంసీ అధికారులు, పోలీసులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పండావీధిలో ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు, పోలీసులు తొలగించారు. రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, వ్యాపారాల వల్ల ఇబ్బంది పడుతున్నామని వాహన చోదకులు, పాదచారులు, స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వన్‌టౌన్ పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బండి నడవాలి.. బతుకు సాగాలి

ఎండైనా, వానైనా వారి బతుకు బండి ఆగదు. ఆగితే వారి నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లవు. ఆ పూట కుటుంబం మొత్తం పస్తులుండాల్సిందే. అందుకే సీజన్ ఏదైనా వారు చక్రంలా గిర్రున తిరుగాడాల్సిందే. వారే వీధి విక్రయదారులు. తోపుడుబళ్ల మీద నేరుగా మన వద్దకే వివిధ రకాల సరకులను తీసుకొచ్చి ఎంతో కొంత లాభానికి అమ్మి జీవనం సాగిస్తుంటారు.

- నిత్య బతుకుపోరులో వీధి వ్యాపారులు
- అన్‌సీజన్‌లో విక్రయాలు లేక వెతలు
- సంక్షేమ నిధి ఏర్పాటుతో భరోసా దొరుకుతుందని వినతి



అల్లిపురం గాంధీ బొమ్మ వద్ద కొబ్బరిబొండాలు అమ్ముతున్న మొల్లేటి రాజు



వీధివీధి తిరిగి కాయగూరలు అమ్ముకుంటున్న వ్యాపారి రాము

అల్లిపురం: ఉదయం లేవగానే మన కాలనీల్లోను.. వీధుల్లోను తోపుడు బండ్ల ద్వారా కాయగూరలు, పండ్లు, చిన్నపిల్లల దుస్తులు, ప్లాస్టిక్ సామాన్లు విక్రయించే చిరు వ్యాపారులు కనిపిస్తారు. వారు వీధివీధి తిరుగుతూ విక్రయాలు జరపడం ద్వారా మన పనిని, కాలాన్ని ఆదా చేస్తుంటారు. ఉదయం నుండి అర్ధరాత్రి వరకు రోడ్లు పట్టుకు తిరుగుతూ, కుటుంబ పోషణ భారాన్ని మోస్తుంటారు. ఈ రంగంలో పురుషులతో పాటు మహిళలు కూడా సమానంగా పని చేస్తుండటం విశేషం. భర్త సంపాదనకు తమ వంతు సహకారం అందిస్తున్నారు. సొంత బండ్లు లేక కొంత మంది అద్దె బండ్లు తీసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రోజుకి వచ్చిన ఆదాయంలో కొంత అద్దెకు, మరికొంత ఫైనాన్సర్లకు పోగా మిగిలింది కుటుంబ పోషణకు వాడుకుంటున్నారు. వర్షం వస్తే వీరి వ్యాపారాలు మూలకు చేరాల్సిందే. ఆరోజు పస్తులు తప్పనిసరి.

నగరంలో హాకర్‌జోన్లు ఏర్పాటు చేయాలి..

నగరంలో హాకర్ జోన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని తోపుడు బండ్ల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాకర్ జోన్లు లేకపోవడంతో జంక్షన్లలో బండ్లు తొలగించమని పోలీసులు ఒత్తిడి చేస్తున్నారని వాపోతున్నారు. జీవీఎంసీ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ, రామకృష్ణజంక్షన్, లక్ష్మీటాకీస్, పోలీస్ బ్యారెక్స్, ఆర్కేబీచ్, ఫిషింగ్ హార్బర్, జ్ఞానాపురం ప్రాంతాల్లో హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

సంక్షేమం కల్పించాలి..

జబ్బు, జ్వరం వచ్చినప్పుడు పనిలేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని వీధి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు కొంత మేర తమను ఆదుకుంటున్నాయని వారు తెలిపారు. కానీ జీవీఎంసీ పరిధిలో ముఖ్యమైన జంక్షన్ల వద్ద, రద్దీ ప్రదేశాల్లో బండ్లు పెట్టుకుంటే పోలీసులు తొలగించమని ఆదేశిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడికక్కడ హాకర్ జోన్లు ఏర్పాటు చేసినట్లయితే తమకు కొంచం వెసులుబాటు కలుగుతుందని చెబుతున్నారు. జీవీఎంసీ పరిధిలో వెండింగ్ సర్టిఫికెట్లు, ఫొటో గుర్తింపు కార్డులు అందజేయాలని కోరుతున్నారు.

గుర్తింపు కార్డులివ్వాలి..



జీవీఎంసీ పరిధిలో గల వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు అందజేయాలి. సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి. ఈ మేరకు ప్రభుత్వానికి విన్నవించుకున్నాం. విశాఖనగరంలో ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గంలో స్థానికులే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా వీధి విక్రయదారులు వస్తుంటారు. రిఫరల్, నాన్ రిఫరల్ కార్డులు జారీ చేయాలని అభ్యర్థించాం.

– **తెడ్డు వెంకటేశ్వరరావు**, ఏపీ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి..



సీజనల్ వ్యాపారం చేసుకుంటున్నాను. ఈ వ్యాపారం బాగుంటుంది. అన్‌సీజన్‌లో వ్యాపారం జరగదు. ఆరోగ్యం బాగులేకపోతే బండి వేయటం కుదరదు. అలాంటప్పుడు బండి అద్దె కూడా కట్టలేము. అనారోగ్యం పాలైతే వైద్యం చేయించుకోవటం కష్టంగా ఉంటుంది. ప్రభుత్వం మాకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

–**మొల్లేటి రాజు**, కొబ్బరిబొండాల వ్యాపారి

ప్రభుత్వం ఆదుకోవాలి



సీజనల్ పండ్ల వ్యాపారం చేస్తుంటాను. ఫైనాన్స్‌లతో సొంత బండి సమకూర్చుకున్నాను. ప్రస్తుతం వ్యాపారం బాగానే ఉంది. ప్రత్యేక రోజుల్లో వ్యాపారం బాగుంటుంది. సరకు అరువు తీసుకువచ్చి వ్యాపారం చేస్తుంటాను. రోజుకి రూ.200 నుండి రూ.300 వరకు గిట్టుబాటు అవుతుంది. అనారోగ్య సమయంలో మాత్రం ఆదాయవనరు కోల్పోతున్నాం. వీధి వ్యాపారుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిధిని ఏర్పాటు చేస్తే మాకు భరోసా కలుగుతుంది.

–**ఎ.రాము**, కాయగూరల వ్యాపారి

మర్యాదపూర్వక కలయిక



మన్మథరావును సత్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, శిష్టకరణం లేఖ పత్రిక ఐక్యవేదిక బృందం సభ్యులు మంగళవారం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో గల మెట్రో ప్రాజెక్టు డైరెక్టర్ ఉర్లాం జయ మన్మథరావును మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో నరసింహారావు, నరేష్, నరహరి, మహేష్, ఫణి, శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కుప్పిలి కీర్తి తదితరులు పాల్గొన్నారు.

రెండు రైళ్లు ఆలస్యం

తాటిచెట్లపాలెం : షాలిమార్‌లో మే 9న మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమార్ – చెన్నై (12841) కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.20గంటలకు బయల్దేరింది. 9న చెన్నై సెంట్రల్‌లో రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 7.15కు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ – హౌరా(12840) మెయిల్ మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 10.05గంటలకు బయల్దేరుతుంది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు ఇవి చేరుకోనున్నాయి. ఈ రెండు రైళ్లు ఆలస్యంగా చేరుకున్న కారణంగా ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఘనంగా ముగ్గురు అమ్మవార్ల మహోత్సవం



అమ్మవార్లకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధి అంగటిదిబ్బలో వెలసిన 29, 30 వార్డుల గ్రామ దేవతలు పోలమ్మ, ముత్యాలమ్మ, నూకాలమ్మ (ముగ్గురు అమ్మవార్లు) 23వ జాతర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పెద్ద ఎత్తున తొలేళ్ల ఉత్సవం జరిపారు. ప్రధాన పండగను పురస్కరించుకుని మంగళవారం ఉదయం నుంచే అమ్మవార్లకు విశేష పూజలు, పంచామృతాభిషకాలు నిర్వహించారు. అంగటిదిబ్బ, రామజోగిపేట, కొల్లూరు మేన్షన్స్, దండుబజార్, చండకవీధి, దిబ్బలపాలెం, సాలిపేట, కుమ్మరవీధి, మహారాణిపేట, కృష్ణానగర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, పార్టీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అమ్మవార్ల ఘటాలు, ఉత్సవ విగ్రహాలు ఊరేగించారు. ప్రధాన పండగ సందర్భంగా ఉదయం నుంచి విశేష దర్శనాలు కల్పించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పులివేషాలు, సాముగరిడి, తప్పెటగుళ్లు, కాళీ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాదర్బార్‌కు చక్కటి ఆదరణ



ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ: ప్రజాదర్బార్‌కు చక్కటి ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఇళ్ల స్థలాల కోసం, వైఎస్సార్ బీమా కోసం, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం, రోడ్ల మరమ్మతులు, భవన నిర్మాణాల కోసం.. ఇలా పలు సమస్యలపై వచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. అలాగే వార్డులో ఇబ్బందులు పడుతున్న పలువురికి సొంత నిధుల నుంచి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, దక్షిణ నియోజకవర్గం మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణ, నానీ, కమలాద్దీన్, సలీం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీమాతో భరోసా



అమ్మవారివీధిలో బాలాజీ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా అందజేస్తున్న శ్రీహరిరెడ్డి



కంసాలవీధిలో మృతుని భార్య దుర్గకు వైఎస్సార్ బీమా అందజేస్తున్న తోట పద్మావతి

అల్లిపురం: వైఎస్సార్ బీమాతో లబ్ధిదారులకు భరోసా కలుగుతుందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. కొబ్బరితోట–2 సచివాలయ పరిధి, కంసాలవీధిలో నివసిస్తున్న లంకపల్లి వీరభద్రరావు ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులకు కార్పొరేటర్ పద్మావతి, సచివాలయ కన్వీనర్ భాస్కరరావు, వెల్ఫేర్ సెక్రటరీ గౌస్, వలంటీర్ హైమావతిలతో కలసి తక్షణ సహాయం కింద వైఎస్సార్ బీమా అందజేశారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే అమ్మవారివీధికి చెందిన దుంప బాలాజీ ఇటీవల లివర్ వ్యాధితో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, వుడ్‌యార్డ్ స్ట్రీట్ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ పార్వతి, వలంటీర్ సత్య వెంకటేష్ తక్షణ సహాయం కింద వైఎస్సార్ బీమా అందజేశారు.

వేడుకగా కొత్తమ్మ ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవంలో మహిళల కోలాటం

అల్లిపురం: అమ్మవారివీధి ప్రజల ఆరాధ్య దైవం, గ్రామదేవత కొత్తమ్మవారి నెల రోజుల పండగ మంగళవారం ఘనంగా ప్రారంభమయింది. ఈ సందర్భంగా కొత్తమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. సాయంత్రం మొదటి మంగళవారం భూలోకమాత అమ్మవారి పండగ వైభవంగా చేపట్టారు. తొలుత అమ్మవారి వీధిలో గల పెద్దింటి నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, మహిళల కోలాటం, బిందుల నృత్యాల మధ్య అమ్మవారి తిరువీధి ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని కాగడాల వెలుగులో అమ్మవారివీధి, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ల మీదుగా గోకుల్ థియేటర్ ఊరేగించారు. అక్కడ భూలోకమాత అమ్మవారికి పూజలు నిర్వహించి పండగ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో నీలాపు రమణారెడ్డి, నీలాపు విజయానందరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాల శ్రీహరిరెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశేషంగా అభిషేకాలు



సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్ల వితరణ



కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్లు అందజేస్తున్న సింహాద్రి టీఎంటీ, హిమా హ్యూమానిటేరియన్ సంస్థ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: సింహాద్రి టీఎంటీ, హిమ హ్యూమానిటేరియన్ సంస్థ కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్లను సమకూర్చాయి. వాటిని హిమ హ్యూమానిటేరియన్ చైర్మన్ బీఎస్ మూర్తి, సింహాద్రి టీఎంటీ డైరెక్టర్ వి.వి.కృష్ణారావు కేజీహెచ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఏఆర్ఎంవో డాక్టర్ అరుణదేవికి అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ 32 ఏళ్లుగా హిమ హ్యూమానిటేరియన్, సింహాద్రి టీఎంటీ కేజీహెచ్‌కు అందజేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. మరెన్నో సేవా కార్యక్రమాలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పైల సన్నిబాబు, ఏఆర్ఎంవో డాక్టర్ అరుణదేవి, డాక్టర్ జగదీష్, మీసాల రామకృష్ణ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సులోచన, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, పల్లా ఆనంద్, కేవీ వేంకటేశ్వరరావు, హిమ హ్యూమానిటేరియన్ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్ పాల్గొన్నారు.

విజ్ఞానానికి దోహదం.. వేసవి శిక్షణ శిబిరాలు



విద్యార్థినులను అభినందిస్తున్న గ్రంథాలయ పరిషత్ సభ్యుడు మహేష్ తదితరులు

అల్లిపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన శిబిరాన్ని ఆయన సందర్శించారు. జూన్ 11వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయంలో పాఠకులకు కావాల్సిన పుస్తకాలు, కంప్యూటర్లు, సామగ్రి, సౌకర్యాలను ప్రభుత్వంతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ విద్యార్థులకు కథలు, మ్యాథ్‌మేటిక్స్ వివరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపును అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఇన్‌చార్జి పీవీ నూకరాజు, లైబ్రేరియన్ ఎల్ ఆర్ వర్మ, రిసోర్స్ పర్సన్లు శ్రీనివాస్, సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

‘మీ అమ్మాయిలను కాపాడుకోండి’



సమావేశంలో మాట్లాడుతున్న జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు

దాబాగార్డెన్స్: ది కేరళ స్టోరీ సినిమా చూసి, మీ అమ్మాయిలను లవ్ జిహాద్ బారి నుంచి కాపాడుకోవాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు పిలుపునిచ్చారు. కేరళలో ప్రేమ పేరిట వేలాది మంది హిందూ, క్రిస్టియన్ అమ్మాయిలను పథకం ప్రకారం ముస్లింలుగా మత మార్పిడి చేస్తున్నారని అన్నారు. వివాహం చేసుకుని ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న ఐసిస్ ఉగ్రవాద శిక్షణ స్థావరాలకు తరలిస్తున్నారని అన్నారు. అక్కడ లైంగిక కోరికలు తీర్చే బానిసలుగా దుర్భర జీవితంలోని యువతులను నెట్టేస్తున్నారని తెలిపారు. ది కేరళ స్టోరీ సినిమా ద్వారా ఇదంతా అవగతం అవుతుందన్నారు. ఈ సినిమా కేవలం కలెక్షన్ల కోసమో, హిందూ, ముస్లిం సమస్యగానో భావించవద్దని, మానవత్వానికి–ఉగ్రవాదానికి మధ్య జరుగుతున్న వాస్తవ ప్రయత్నంగానే భావించాలని తెలిపారు.

వెంకటాద్రిని సందర్శించిన డీసీ సుజాత



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీసీ సుజాత

సింహాచలం: పెందుర్తిలోని వెంకటాద్రిని దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత మంగళవారం సందర్శించారు. వెంకటాద్రిపైకి నిర్మిస్తున్న రెండో ఘాట్‌రోడ్డు పనులతో పాటు అన్నప్రసాద సత్రాన్ని పరిశీలించారు. అలాగే పంచవటి పేరిట నిర్మించిన గెస్ట్ హౌస్‌ను ఇటీవల వెంకటాద్రి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ భవనాన్ని డీసీ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు రామానుజమ్, అర్చకుడు ఎం.వి.ఆర్.చార్యులు, దేవస్థానం ఈవో నీలిమ తదితరులు పాల్గొన్నారు.

కునుకు తీస్తే తనువు కాస్త కుదుట పడతది



బీచ్‌రోడ్డు కోటేశ్వరాలయం ముందు సేదదీరుతున్న కూలీలు



ఎండ వేడిమి వేళ గట్టుపై సేద దీరుతున్న మహిళలు



తోపుడు బండే సేదదీరుస్తుంది

- ఎండలకు అల్లాడుతున్న శ్రమజీవులు
- సేదదీరేందుకు చెట్టు నీడనో.. గట్టు ముంగిటనో ఆశ్రయిస్తున్నారు

దాబాగార్డెన్స్ : ఆకలి రుచెరగదు. నిద్ర సుఖమెరగదంటారు పెద్దలు. దానికి చక్కటి నిదర్శనమే ఈ కష్టజీవులు. కడుపు నిండిందో లేదో తెలియదు కానీ.. ఎండ వేళ కాస్త చల్లని గాలి ఒంటిని తాకగానే తామెక్కడున్నామో పట్టించుకోకుండా ఒళ్లు మరిచి ఇలా నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నారు. నిద్ర పట్టక ఎందరో సతమతమవుతున్న ఈ రోజుల్లో ఎక్కడైనా ఇలా హాయిగా నిద్రపోగలిగే వీరంతా అదృష్టవంతులు. ఉదయం నుంచి మిట్ట మధ్యాహ్నం వరకు మండుటెండను సైతం లెక్కచేయక బీచ్‌రోడ్డు, నగరంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్ లైన్ పనులు, మట్టిపనులు చేస్తున్న వీరు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కాసేపు కునుకుతీద్దామనుకున్నారు. అయితే బీచ్‌రోడ్డులో సేదదీరేందుకు అనువైన చోటు లేకపోవడంతో నోవాటెల్ హోటల్ ముందున్న కోటేశ్వరాలయమే వీరికి దిక్కయింది. ఆలయ పరిసరాల్లో ఉన్న చెట్టు నీడలోనే వీరంతా ఇలా సేద దీరారు. మరికొందరు నోవాటెల్ ప్రహరీకి ఆనుకుని ఉన్న గడ్డి తుప్పలు.. గట్లను ఆశ్రయించారు.

రిక్షా కార్మికుల పరిస్థితి మరీ దారుణం..

మండుటెండలకు రిక్షా కార్మికుల పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. ఎండలో రిక్షా తోలలేక అవస్థ పడుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలలో రిక్షా లాగి కాసింత ముద్ద దిగిన తర్వాత తీసిన కునుకుతో శ్రమను మరిచిపోతున్నారు.

వైభవంగా దుర్గమాంబ జాతర



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మేయర్ హరి వెంకటకుమారి దంపతులు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి దుర్గానగర్, గొల్ల కంచరపాలెం ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తొలిపూజ గ్రామ కమిటీ సభ్యులు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలతో దర్శనాలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నగర మేయర్ గొలగాని వెంకట హరికుమారి దంపతులు, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, కార్పొరేటర్లు రాజశేఖర్, రజిని, వాణీనానాజీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశికూడలి, దయానందనగర్, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.